సాక్షి

రాజన్న సిరిసిల్ల

మంగళవారం। 12। సెప్టెంబర్। 2023

అంగన్‌వాడీల సమ్మెబాట



సిరిసిల్లటౌన్: హక్కుల సాధనకు అంగన్‌వాడీలు సోమవారం సమ్మెబాట పట్టారు. సిరిసిల్ల ఆర్డీవో ఆఫీసు ముందు చేపట్టిన మహాధర్నాకు వీరికి ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రజాసంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం



మామిడిపల్లిలో ప్రొసీడింగ్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): బీఆర్‌ఎస్ పాలనలోనే ప్రజాసంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. మండలంలోని మామిడిపల్లిలో మహిళా సంఘం భవనానికి రూ.3 లక్షల ప్రొసీడింగ్స్ అందించారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు, ఖబ్రస్థాన్ వద్ద వేసిన బోరును సోమవారం ప్రారంభించారు. అరుణ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు రూ.5 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సర్పంచ్ కొక్కుల భారత, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బండ నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ ప్రభాకర్‌రావు, నాయకులు నంద్యాడపు సాగర్, కొక్కుల నర్సయ్య, సర్పంచుల ఫోరమ్ కన్వీనర్ గోపు పర్శయ్య పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ సదన్‌కుమార్

ముస్తాబాద్(సిరిసిల్ల): అందరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన ఉండాలని సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్ కోరారు. ముస్తాబాద్‌లోని ఏఎంఆర్ గార్డెన్స్‌లో సోమవారం ఎన్నికల నిబంధనలపై రాజకీయ పక్షాలకు అవగాహన కల్పించారు. సీఐ సదన్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే ఎన్నికల కోడ్ వర్తిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లోలో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా రాజకీయ పక్షాలు సహకరించాలన్నారు. తహసీల్దార్ గణేశ్, ఎస్సై శేఖర్‌రెడ్డి, ఎంపీడీవో రమాదేవి, రిసోర్స్ పర్సన్ ఉపేందర్, ఆర్‌ఐ శ్యామ్ పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

సిరిసిల్లఅర్బన్: హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ టోర్నమెంట్ కరాటేలో జిల్లా విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జోయా ఆనమ్, ఫిర్దోస్, నేత్ర, సంజన, వరుణ్, ప్రణవ్, అక్షిత్, అఖిల్, హరీశ్‌లను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, డీఈవో రమేశ్‌కుమార్ అభినందించారు. గోజిరాయ్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ జవేరియా బేగం తదితరులు ఉన్నారు.

తెలంగాణ వీరుల విగ్రహాలు ఏర్పాటు చేయండి



బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న చాడ వెంకటరెడ్డి

ఇల్లంతకుంట(మానకొండూర్): తెలంగాణ సాయుధ పోరాట వీరులైన బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డిల విగ్రహాలను సిరిసిల్ల నడిబొడ్డులో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి కోరారు. మండలంలోని గాలిపల్లిలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. 1948 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో 3,500 మంది అమరులయ్యారని, మూడు లక్షల ఎకరాల భూములను ప్రజలను పంచిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలు చైతన్యవంతులు కావాలని కోరారు. బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, రాములు, భూంరెడ్డి, వేణు, లక్ష్మణ్, శంకర్ ఉన్నారు.

బట్ట కొను‘గోల్‌మాల్’



ఇది జిల్లా కేంద్రంలోని గోదాముకు చేరిన గతేదాది ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల బట్టల గట్టాలు. ఒక్కో గట్టాలో 1,050 నుంచి 1,200 మీటర్ల బట్ట ఉంటుంది. ఇలా సిరిసిల్లకు చెందిన ఓ బడా వస్త్ర వ్యాపారి(పాలిస్టర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు) ఏకంగా 12 లక్షల మీటర్లు అంటే రూ.4.20కోట్ల విలువైన బతుకమ్మ చీరల పాతబట్టను సరఫరా చేశాడు. అతనికి సాంచాలు లేవు.. ప్రత్యక్షంగా నేసే కార్మికులు లేరు. కానీ ఆసాముల వద్ద సేకరించిన 12 లక్షల మీటర్ల పాతబట్టను అందించాడు. మొత్తంగా పాత బట్ట, కొత్త బట్ట కలిపి ఒక్క సేటు 50 లక్షల మీటర్ల బట్టను సరఫరా చేశాడు. దీని విలువ రూ.17.75 కోట్లు ఉంటుంది.

- పాత బట్టలు.. కొత్త గట్టాలు
- కొత్త బట్ట పక్కకు పెట్టి పాత వస్త్రం సేకరణ
- ‘లక్ష’ణంగా ప్రొక్యూర్‌మెంట్ చేశారు
- గోదాంలోనే అంతా మాయ
- జేటీవోల చేతివాటం.. వసూళ్ల పర్వం
- ఇది సిరిసిల్ల బడాసేట్ల బాగోతం
- టెస్కో ఉన్నతాధికారుల కనుసన్నల్లో అక్రమాలు



ఇది సిరిసిల్లకు చెందిన ప్రస్తుత అధికార పార్టీ కౌన్సిలర్, పాలిస్టర్ అసోసియేషన్ ముఖ్యనాయకుడికి చెందిన బతుకమ్మ చీరల పాతబట్టల గట్టాలు. గోదాములోని జేటీవో సహకారంతో పాతబట్టను అమ్మేందుకు 250 గట్టాలను అంటే 2.62 లక్షల మీటర్ల బట్టను(రూ.93.01 లక్షలు) పంపించాడు. కానీ అతను తనకు ముందుగా కేటాయించిన ఆర్డర్ల కంటే అదనంగా ఈ బట్టను సరఫరా చేశాడు. ఆలస్యంగా గుర్తించిన జౌళిశాఖ గోదాము అధికారులు చివరి క్షణంలో ఆ బట్టల గట్టాలను సేకరించకుండా పక్కకు పెట్టి రిజెక్టు చేశారు.



గోదాంకు ఆటోలో వచ్చిన బతుకమ్మ చీరల కొత్త వస్త్రం

సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ కానుకగా ఆడబిడ్డలకు అందిస్తున్న చీరల వస్త్రం సేకరణలోనే అవినీతి జరుగుతుంది. బతుకమ్మ చీరల బట్టను సిరిసిల్లతోపాటు పరిసర గ్రామాల్లో ఉత్పత్తి చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డు గోదాములలో నిల్వ చేస్తున్నారు. ఇక్కడ ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు(జేటీవో) ఒక్కో గట్టకు రూ.60 నుంచి రూ.80 వస్త్రోత్పత్తిదారుల వద్ద తీసుకుంటూ బట్ట నాణ్యతను పరిశీలించి పాస్ చేస్తున్నారు. అదే పాతబట్టల గట్టాలకు రూ.150 వరకు వసూలు చేస్తున్నారు. బట్ట నాణ్యతతో పనిలేకుండా.. పైసలు ఎక్కువ ఇచ్చే సేట్ల వస్త్రాన్ని నేరుగా గోదాముల్లోకి తరలిస్తున్నారు. బడాసేట్లు తెచ్చే పాత వస్త్రాన్ని తీసుకుంటూ సాధారణ ఉత్పత్తిదారుల బట్టల గట్టాలను పట్టించుకోవడం లేదు.

టెస్కో అధికారుల కనుసన్నల్లో అక్రమాలు

గతేదాది ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల బట్ట మిగిలిపోయిందని, దాన్ని కొనుగోలు చేయాలని సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులతో పెద్దసేట్లు జౌళిశాఖ ఉన్నతాధికారులకు వినతులు వెళ్లాయి. నిజానికి అందరి వద్ద కొద్దో, గొప్పో పాత బట్ట మిగిలిపోతుంది. భీములు సమయానికి కట్ కాకపోవడంతో బట్ట మిగులుతుంది. ఈ కారణాన్ని చూపుతూ పాతబట్ట ఎంత ఉన్నా ఇచ్చేయండి.. అంటూ.. టెస్కో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలను కిందిస్థాయి అధికారులు పొందుతారు. ఇదే అదనంగా బడావ్యాపారులు గతేదాది పొడవునా తయారుచేసిన పాతబట్టను (పాత డిజైన్లలోనే) లక్షల మీటర్లలో అందించి చేతులు దులుపుకున్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చే దగ్గరి నుంచి మళ్లీ బట్ట కొనుగోలు చేసేదాకా.. బడా వ్యాపారులకు ఉపుందిస్తూ టెస్కో అధికారులు పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో చిన్న వ్యాపారులు, సగటు వస్త్రోత్పత్తిదారులు నలిగిపోతున్నారు.

పాతబట్టతో కొత్త వస్త్రానికి ఇబ్బందులు

- సిరిసిల్లలో పది మంది పెద్ద సేట్లు పాతబట్టను అందించగా.. వందలాది మంది మధ్యతరగతి వ్యాపారులు కొత్త వస్త్రాన్ని ఉత్పత్తి చేశారు. పాత బట్టతో గోదాము నిండిపోవడంతో కొత్త వస్త్రానికి స్థలం లేకుండా పోయింది.
- పాలిస్టర్ అసోసియేషన్ ముఖ్యనాయకుడు ఒకరు 20 లక్షల బట్ట ఆర్డర్లు తీసుకుని వరంగల్‌లో ఉత్పత్తి చేయించే ప్రయత్నం చేశారు. కానీ అక్కడ సాధ్యం కాకపోవడంతో చివరి దశలో చేతులు ఎత్తేశాడు. దీంతో ఆ మేరకు జాకెట్ల బట్ట ఆర్డర్లను టెక్స్‌టైల్‌పార్క్‌కు అందించారు.
- గోదాములో అక్రమాలకు, అవినీతికి పాల్పడుతున్న ఇద్దరు జేటీవోలను విధుల నుంచి ఇటీవల జౌళిశాఖ అధికారులు తప్పించారు. అధికార పార్టీ నేతలతో పైరవీలు చేయించుకుని మళ్లీ ఆదివారం ఆ ఇద్దరు జేటీవోలు విధుల్లో చేరారు. ఇలా బతుకమ్మ చీరల సేకరణలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

బతకమ్మ చీరల ఉత్పత్తి స్వరూపం ఇలా..

చీరల ఆర్డర్లు	: 5.56కోట్ల మీటర్లు
ఇప్పటి వరకు సేకరించిన చీరల బట్ట	:4.05 కోట్ల మీటర్లు
ఇంకా సేకరించాల్సినది	:1.51 కోట్ల మీటర్లు
చివరి గడువు	: సెప్టెంబరు 15
చీరల ఆర్డర్ల విలువ	: రూ.330 కోట్లు
ఉత్పత్తి చేస్తున్న చిన్న తరహా పరిశ్రమలు	: 127
భాగస్వాములైన మ్యాక్స్ సంఘాలు	: 139
ఒక్కో మీటరుకు ప్రభుత్వం చెల్లిస్తుంది	: రూ. 35.50
ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్న సాంచాలు	: 10,500
నేతకార్మికులు	: 5 వేలు
నిత్యం ఉత్పత్తి అవుతున్న చీరల బట్ట	:4.40లక్షల మీటర్లు

అనుమతి పొందే పాతబట్టను సేకరించాం



సిరిసిల్లలో 2022 నాటి బతుకమ్మ చీరల బట్టను ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని సేకరించాం. వస్త్రోత్పత్తిదారులకు ఇచ్చిన ఆర్డర్లకు అనుగుణంగా ఆ మేరకు 40 లక్షల మీటర్లు పాతబట్టను సేకరించాం. మిగితాది కొత్తదే తీసుకున్నాం. బట్ట సేకరణకు గడువు సమీపించడంతో గోదాము నిండిపోయింది. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగానే బట్ట సేకరణ చేపడుతున్నాం.

– యాదగిరి, టెస్కో జనరల్ మేనేజర్, హైదరాబాద్

అర్జీలు అందుకోండి.. సమస్యలు పరిష్కరించండి

- కలెక్టరేట్‌కు బారులు తీరిన బాధితులు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అనురాగ్‌జయంతి
- ప్రజావాణిలో 55 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్‌జయంతి

సిరిసిల్లఅర్బన్:క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో పలువురు బాధితులు కలెక్టరేట్ బాట పడుతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లావ్యాప్తంగా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో బాధితులు తరలివచ్చారు. అర్జీలు అందజేసి.. ఆదుకోండంటూ వేడుకున్నారు. బాధితులు నుంచి కలెక్టర్ అనురాగ్ జయంతి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 55 దరఖాస్తులు వచ్చాయి. అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, ఆర్డీవోలు పవన్‌కుమార్, మధుసూదన్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీఆర్డీవో నక్క శ్రీనివాస్ ఉన్నారు.

పాఠశాల ఆవరణలో నిర్మించొద్దు



పాఠశాల ఆవరణలో గ్రామపంచాయతీ ప్రగతివనం నిర్మించొద్దు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తే విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు.

– గోపాల్‌రావుపల్లె గ్రామస్తులు, తంగళ్లపల్లి

సదరం సర్టిఫికెట్ ఇవ్వండి



నా వయస్సు పెరుగుతున్న కొద్ది కాళ్లలో చలనం కోల్పోయి నడవలేకపోతున్న. ఐదేళ్లుగా ఇంటి వద్దే ఉంటున్న. ఏ పని చేసుకోలేకపోతున్న. సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే వైకల్యం లేదంటున్నారు.

– కుంచాల కార్తీక్, ఎల్లారెడ్డిపేట

ఓటీఎస్ కింద నగదు ఇవ్వండి



మా ఊరిలో అదనపు టీఎంసీ వరద కాలువ నిర్మాణంలో దాదాపు 80 ఇళ్లు పోతున్నాయి. అధికారులు వచ్చి సర్వే చేసి రెండు ఆప్షన్స్ ఇచ్చారు. పునరావాసకాలనీ, వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) కింద నగదు రూపంలో అందజేస్తామని తెలిపారు. ఓటీఎస్ కింద నగదు అందిస్తే మాకు అనువైన చోట ఇళ్లు నిర్మించుకుంటాం.

– దేశాయిపల్లి గ్రామస్తులు, బోయినపల్లి

నా కొడుకును కాపాడండి



వేడి నీళ్లు పడి రెండు చేతులు కాలిపోయిన తన కొడుకు ఆపరేషన్‌కు ఆర్థికసాయం అందించాలని బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లికి చెందిన నక్క ఉమ కలెక్టర్‌ను వేడుకుంది. నక్క శ్రీనాథ్–ఉమ దంపతుల రెండేళ్ల కుమారుడు రణధీర్‌కు ఏడాది క్రితం వేడినీళ్లు పడి రెండు చేతులు, ముఖం కాలాయి. ఇప్పటి వరకు చికిత్సకు దాదాపు రూ.15 లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం రెండు చేతులకు ఆపరేషన్ కోసం మరో రూ.10లక్షలు ఖర్చవుతాయని.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంది.

ట్రైసైకిల్ ఇప్పించండి



బ్యాటరీ ట్రైసైకిల్ ఇప్పించాలని ఓ దివ్యాంగురాలు కలెక్టర్‌తో మొరపెట్టుకుంది. కామారెడ్డి జిల్లాకు చెందిన చిత్తరి మల్లేశ్వరీ వేములవాడలో ఉంటుంది. గతంలో ప్రభుత్వం ఇచ్చిన బ్యాటరీ ట్రైసైకిల్ ఎవరో దొంగిలించగా, మరో ట్రైసైకిల్ కోసం కలెక్టరేట్‌కు వచ్చింది. తనకు బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ ఇచ్చే వరకు వెళ్లేది లేదని బైఠాయించడంతో అడిషనల్ కలెక్టర్ భీమ్యానాయక్ స్పందించి ఇప్పించారు.

వైభవంగా మహాలింగార్చన



వేములవాడ: రాజన్న సన్నిధిలో మాసశివరాత్రిని పురస్కరించుకుని సోమవారం రాత్రి అద్దాల మండపంలో మహాలింగార్చనను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు అర్చకులు, భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

అర్హులకు ఓటుహక్కు కల్పిస్తాం

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని అర్హులకు ఓటుహక్కు కల్పిస్తామని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో అక్టోబరు 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువతీయువకులకు ఓటుహక్కు కల్పించాలన్నారు. తప్పులు లేని జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2023ను రెండో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఓటర్ల జాబితా తయారీ, సవరణలపై పలు సూచనలు ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎన్.భీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎన్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, జిల్లా ముఖ్యప్రణాళికాధికారి శ్రీనివాసాచార్యులు, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేలో 18 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 18 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆయా ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్టప్రకారం నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని సూచించారు.

చిగురించిన ఆశలు

- టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల
- నిరుద్యోగులకు తీపి కబురు
- ప్రిపరేషన్‌లో నిమగ్నం



పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు

జిల్లాలో ఖాళీలు ఇలా..

స్కూల్ అసిస్టెంట్లు	23
భాషా పండితులు	12
పీఈటీలు	4
ఎస్‌జీటీలు	64
మొత్తం	103

గంభీరావుపేట(సిరిసిల్ల): ఏళ్లుగా ఎదురుచూపులు ఫలించాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్టీ)కు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగులు ప్రిపరేషన్‌లో మునిగిపోయాయి. చివరిసారిగా 2018లో టీఎస్‌పీఎస్సీ ద్వారా పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం ఐదేళ్ల తర్వాత ఉపాధ్యాయ నియామక పరీక్షల నిర్వహణకు పచ్చజెండా ఊపింది. ఈసారి విద్యాశాఖ ఆధ్వర్యంలో పరీక్ష చేపట్టనుంది. నోటిఫికేషన్ విడుదల కావడంతో అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రిపరేషన్‌కు ఎక్కువ సమయం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 103 పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయింది.

ఆన్‌లైన్‌లో పరీక్ష

టీచర్ల భర్తీకి ఈనెల 20 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 15న టెట్ పరీక్ష జరగనుంది. ఈ ఏడాది బీఈడీ, డీఎడ్ పూర్తి చేసిన వారు సైతం టీఆర్టీకి అర్హులు కానున్నారు. తొలిసారి పరీక్ష ఆన్‌లైన్‌లో(కంప్యూటర్ బేస్ట్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

పోస్టుల సంఖ్య పెంచాలి



ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య తక్కువగా ఉంది. మరిన్ని పోస్టులు పెంచాలి. ప్రిపరేషన్‌కు తక్కువ సమయం ఉంది. సమయం పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– వెంకటేశ్, నిరుద్యోగి, గంభీరావుపేట

ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నాం



ఐదేళ్లుగా టీఆర్టీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నాం. పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ అవుతూనే ఉన్నాం. ఆలస్యంగానైనా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం సంతోషకరం. ప్రణాళికాబద్ధంగా చదివి అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి ప్రయత్నిస్తాం.

– సాయికుమార్, నిరుద్యోగి, గంభీరావుపేట

‘ఆశ’లు నెరవేరేదెప్పుడో?

- ఏళ్లుగా వెట్టిచాకిరీ
- పనిభారం ఎక్కువ.. వేతనాలు తక్కువ
- శ్రమదోపిడీపై పోరుబాట
- కనీస వేతనం, ఉద్యోగ భద్రతకు డిమాండ్


ధర్నా చేస్తున్న ఆశాకార్యకర్తలు

సిరిసిల్లటౌన్: క్షేత్రస్థాయిలో వైద్యశాఖకు సంబంధించిన పనులన్నీ చేస్తున్న ఆశవర్కర్లకు కనీస వేతనాలు కరువయ్యాయి. అధిక పనిభారం.. సమయపాలన లేకుండా సేవ చేస్తున్న తమకు కనీసం ఉద్యోగభద్రత లేదని.. వెట్టిచాకిరీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు కనీస వేతనాలు.. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు ఇటీవల పోరుబాట పట్టారు.

పని ఎక్కువ..వేతనాలు తక్కువ

జిల్లా వ్యాప్తంగా వెయ్యి వరకు ఆశవర్కర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. కరోనా సమయంలో కరోనా పేషెంట్లకు క్షేత్రస్థాయిలో ఉంటూ మందులు అందించడం నుంచి ఏ సమయంలోనైన సలహాలు, సూచనలు ఇస్తూ మనోధైర్యం కల్పించారు. అంతేకాకుండా ఫీవర్‌సర్వేలు.. టీబీ రోగుల వివరాల సేకరణ.. గర్భిణుల వివరాల సేకరణ, ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీలు చేయించడం, పిల్లలకు టీకాలు వేయించడం.. వంటి అన్ని కార్యక్రమాలకు ఆశవర్కర్లే ముందుంటున్నారు. గతంలో వీరికి రూ.7,500 మాత్రమే వేతనంగా వచ్చేది. 2021 జూలై తర్వాత పెరిగిన పీఆర్సీ ప్రకారం రూ.9,750 వస్తున్నాయి. అవికూడా టార్గెట్లు పూర్తి చేసిన వారికే వస్తున్నాయని ఆశవర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకే వారు విధులు నిర్వర్తించాలి. కానీ గ్రామాల్లో ఏ సమయంలోనైనా వారు అందుబాటులో ఉంటున్నారు.

ఆశవర్కర్ల డిమాండ్లు

- కనీసం వేతనం, పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి.
- హెల్త్‌కార్డులు, ప్రమాదబీమా రూ.5లక్షలు చెల్లించాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పిస్తూ, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.
- ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో పదోన్నతి కల్పించాలి.
- రిజిష్టర్లను ప్రభుత్వమే ప్రింట్ చేయించి ఇవ్వాలి. ఇప్పటి వరకు ఖర్చు చేసిన రిజిష్టర్ల ఖర్చులు ఇవ్వాలి.
- జాబ్‌చార్టు అమలు చేయాలి. పారితోషికం లేకుండా అదనపు పనులు చేయించొద్దు.
- జిల్లా ఆసుపత్రుల్లో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి.

టీబీ స్పూటమ్ డబ్బాలు మోయిస్తున్నారు



టీబీ టెస్టులకు రోగుల స్పూటమ్ డబ్బాలను మాతోనే మోయిస్తున్నారు. టీబీ, లెప్రసీ, కంటివెలుగు పథకాల బకాయిలు చెల్లించాలి. కనీస వేతనం రూ.21వేలు అందించి, ఉద్యోగభద్రత కల్పించాలి.

– కుమ్మరవేణి భారతి, గంభీరావుపేట

ఆరోగ్యకార్డుల్లేకుండా ఉంటున్నాం



కనీసం ఆరోగ్య కార్డులు లేవు. వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలి. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్సులు 16 నెలల బకాయిలు అందించాలి. లెప్రసీ సర్వేలో చనిపోయిన ముగ్గురు ఆశవర్కర్ల కుటుంబాలను ఆదుకోవాలి.

– బాధవేని మంజుల,ముస్తాబాద్

పింఛన్లు అమలు చేయాలి



సామాజిక పింఛన్లు అమలు చేయాలి. ఇతర జిల్లాల్లో వస్తున్నాయి. ప్రసూతి సెలవులపై సర్క్యులర్ విడుదల చేయాలి. ఎప్పుడు ఏ సమస్య ఉందని ఫోన్ చేసిన వెంటనే సహాయం చేస్తాం. మా సమస్యలు మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు.

– జోగు దేవలక్ష్మి, కొత్తపల్లి

క్లుప్తంగా

కౌలురైతు కుటుంబానికి రాహుల్‌హెగ్డే సాయం


నగదు అందిస్తున్న నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌కు చెందిన కౌలురైతు అనమేని నర్సింలు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందగా ఆయన కుటుంబానికి గతంలో జిల్లా ఎస్పీగా పనిచేసిన రాహుల్‌హెగ్డే ఆర్థికసాయం అందించారు. ముస్తాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు నాని రైతు కుటుంబ దీనస్థితిని రాహుల్‌హెగ్డేకు తెలియజేయగా రాహుల్‌హెగ్డే స్పందించి రూ.10వేలు అందించారు. అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ చీటీ జితేందర్‌రావు రూ.5 వేలు అందించారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, నందెల్లి గోపాల్‌రావు, దేశెట్టి నాని, గజ్జెల రాజు పాల్గొన్నారు.

ఎడ్లను ఢీకొట్టిన కారు


తీవ్రంగా గాయపడ్డ మూగజీవి

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి శివారులో వేగంగా దూసుకొచ్చిన ఓ కారు.. మూగజీవాలను ఢీకొట్టిన ఘటన సోమవారం జరిగింది. కామారెడ్డి–సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఓ రైతు పొలం నుంచి ఎడ్లతో ఇంటికెళ్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు ఎడ్లు తీవ్రంగా గాయపడ్డాయి. రోడ్డుపై పడి గిలగిల కొట్టుకున్నాయి. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లిపోయారు. ఎడ్లను ఢీకొట్టిన వెళ్లిన కారు యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు


వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండల కేంద్రంలో గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. పూసల మహేశ్ ఇంటి ఆవరణలో పెంచుతున్న గంజాయి మొక్కలను గుర్తించామన్నారు. తహసీల్దార్ గణేశ్ పంచనామా చేయగా, మొక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మహేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం వివరించారు.

14న జాబ్‌మేళా

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈనెల 14న మినీజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా ఉపాధి అధికారి దేవేందర్‌రావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల వేతనం ఉంటుందన్నారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తిగల నిరుద్యోగ యువకులు తమ బయోడేటా (3 సెట్స్), విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో అదేరోజు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9573381973, 9392664569 నంబర్లను సంప్రదించాలన్నారు.

సిరిసిల్ల నుంచి పోటీ చేస్తా

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్‌రెడ్డి


దరఖాస్తు చేస్తున్న మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): బీజేపీ అభ్యర్థిగా సిరిసిల్ల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఇరవై ఏళ్లుగా బీజేపీలో క్రమశిక్షణ గల నాయకుడిగా పనిచేశానన్నారు. ముస్తాబాద్ జెడ్పీటీసీగా పోటీచేసి గెలిచానన్నారు. ఇంటింటికీ బీజేపీని తీసుకెళ్లడంలో సిరిసిల్ల నియోజకవర్గం అంతటా పనిచేశామన్నారు. గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి అహర్నిషలు కృషిచేసిన తనకు సిరిసిల్ల టికెట్ వస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

అడ్డదారుల్లో దర్శనాలు !

- సీసీ కెమెరా ఫుటేజీల్లో రికార్డ్
- రాజన్న ఆలయంలో ప్రైవేట్ వ్యక్తుల హల్‌చల్


అడ్డదారుల్లో ఆలయంలోకి వెళ్తున్న భక్తులు

వేములవాడ: రాజన్న గుడిలో నిఘా కరువవుతోంది. సోమవారం భక్తుల రద్దీ తీవ్రంగా ఉండడంతో వెంటనే ప్రైవేట్ వ్యక్తులు రంగ ప్రవేశం చేశారు. దూరప్రాంతం నుంచి వచ్చిన భక్తులకు వీఐపీ దర్శనం చేపిస్తామని నమ్మబలికి డబ్బులు వసూలు చేసి ఆలయంలోకి అడ్డదారుల్లో ప్రవేశిస్తున్నారు. అంతేకాకుండా దర్శనానికి తీసుకెళ్లే సమయంలో ఆలయ అధికారులకు ప్రముఖుల పేర్లు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారు. అడ్డదారుల్లో దర్శనానికి వస్తున్న భక్తుల దృశ్యాలు ఆలయ సీసీ కెమెరాలలో రికార్డయ్యింది. భక్తుల వద్ద డబ్బులు తీసుకుని నేరుగా క్యూలైన్లలోకి పంపించిన విషయం ఆలయ అధికారుల దృష్టికి వచ్చింది. సరైన నిఘా లేకనే గుడి ఆవరణలో ప్రైవేట్ వ్యక్తుల ఆగడాలు మితిమీరుతున్నట్లు ప్రచారంలో ఉంది. వివిధ డిపార్ట్‌మెంట్ల పేర్లు, గతంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేసిన వాళ్లు, ప్రైవేట్ వ్యక్తులు, రిపోర్టర్లమని చెప్పుకుంటూ ఆలయ సిబ్బందిని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఈవో కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా.. నిఘా తీవ్రతరం చేస్తామన్నారు. ఆలయ ఆవరణలో ప్రైవేట్ వ్యక్తుల ఆగడాలను అడ్డుకుంటామని తెలిపారు.

‘పెటా’ కార్యవర్గం

సిరిసిల్లఅర్బన్: పెటా జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నర్ర శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాన బాబు, ఉపాధ్యక్షులుగా హమీద్‌ఖాన్, పద్మశ్రీ, పంతం ప్రభాకర్, కోశాధికారిగా అనిల్ గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా దేవిడ్‌సన్, సంతోష్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా మొహినొద్దీన్, భాను, అభినయ హెప్సిభాలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా జోగినిపల్లి రవీందర్‌రావు వ్యవహరించారు.

మెడికల్ కాలేజీ పేదలకు వరం

- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్


మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు పేదలకు వరమని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించింది. ప్రవీణ్ మాట్లాడుతూ ఈనెల 15న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సిరిసిల్ల మెడికల్ కాలేజీని వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ వద్ద సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞత ర్యాలీ, సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని, ఆధునిక వైద్యపరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ వైద్యసేవలు ఉత్తమ స్థాయిలో అందుతున్నాయన్నారు. మెడికల్ కాలేజీ ప్రారంభంతో పేదలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ‘సెస్’ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ఏఎంసీ చైర్మన్లు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిరసనలు.. నినాదాలు

- సిరిసిల్లలో ప్రజాసంఘాల ధర్నాలు


సిరిసిల్ల ఠాణాలో ఆశవర్కర్ల నిరసన

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సోమవారం నిరసనలు.. ధర్నాలతో హోరెత్తింది. అఖిలపక్ష పోరాట కమిటీ, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది ధర్నాలకు దిగారు. చలో హైదరాబాద్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న ఆశవర్కర్లను పోలీసులు అరెస్టు చేసి స్థానిక ఠాణాకు తరలించారు. వీరిని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పరామర్శించారు. హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేని మంజుల, భారతి, రుక్మిణి ఉన్నారు.


నల్లగుడ్డలతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

నల్లగుడ్డలతో నిరసన

పర్మినెంట్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు మూతికి నల్లగుడ్డలు కట్టుకుని నిరసన చేపట్టారు. తుమ్మ రాజేందర్, అబ్దుల్ ఖయ్యూం, కత్తి జయలక్ష్మి, చిప్ప నవీన్, నీరజ, శ్రీనివాస్, సలీం, నరేశ్, వెంకటస్వామి, ఉపేందర్ ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఎంల భిక్షాటన


సిరిసిల్లలో ఎన్‌హెచ్‌ఎం వర్కర్ల భిక్షాటన

తమ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యం వహిస్తుందని ఎన్‌హెచ్‌ఎంలు జిల్లా కేంద్రంలో భిక్షాటన చేపట్టారు. వక్తలు మాట్లాడుతూ ఏళ్లుగా పనిచేస్తున్న తమ సర్వీసులు క్రమబద్ధీకరించాలని కోరారు. పి.రాణి, గిరిధర్, శ్వేత, ఫాజల్, ప్రవీణ్, సునంద, ఫర్వీన్, వనిత, వెంకటేశ్, బాలకృష్ణ, లలితమ్మ, రాజమణి, శేఖర్ పాల్గొన్నారు.

మల్కపేట రిజర్వాయర్‌కు నర్సయ్య పేరు పెట్టాలి


కలెక్టరేట్ ముందు అఖిలపక్ష పోరాట కమిటీ ధర్నా

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే కర్రోల్ల నర్సయ్య పేరును మల్కపేట రిజర్వాయర్‌కు పెట్టాలని అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. నాయకులు రాగుల రాములు, చొప్పదండి ప్రకాశ్, ఎనగందుల వెంకన్న, గుంటి వేణు, మూశం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ అభివృద్ధే ధ్యేయం

- అనుచరులతో డాక్టర్ గోలి మోహన్


వేదికపై గోలి మోహన్

వేములవాడ: వెనుబడిని వేములవాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ఆధ్యా గోలి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గోలి మోహన్ పేర్కొన్నారు. తన అనుచరులతో సోమవారం వేములవాడలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ వేములవాడ అభివృద్ధి కోసం తన అభిమానులు, శ్రేయోభిలాషుల సూచనలతో ఇండిపెండెంట్‌గానైన పోటీలో ఉంటానని ప్రకటించారు. దొరలు, పెత్తందార్ల పాలన కాకుండా బడుగు, బలహీన వర్గాల పాలన కోసం చైతన్యం కావాలని కోరారు. త్వరలోనే భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తానని తెలిపారు.

13న కొబ్బరి ముక్కల సేకరణకు వేలం

వేములవాడఅర్బన్: మండలంలోని అగ్రహారం శ్రీహనుమాన్ ఆలయ ఆవరణలో ఏడాది పాటు కొబ్బరి ముక్కల సేకరణకు టెండర్ నిర్వహిస్తున్నట్లు ఈవో మారుతీ తెలిపారు. ఈనెల 13న మధ్యాహ్నం 12 గంటలకు కరీంనగర్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో టెండర్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.లక్ష డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని వివరించారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్


ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 వాహనం

వేములవాడ: ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు ఆస్పత్రికి తరలించే 108 అంబులెన్స్ వాహనం సోమవారం వేములవాడలో ట్రాఫిక్‌లో చిక్కుకుంది. శ్రావణమాసంలో చివరి సోమవారం కావడంతో రాజన్న దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల వాహనాలతో మూలవాగు వంతెనపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అదే సమయంలో రోగితో వచ్చిన 108 వాహనంలో మూలవాగు బ్రిడ్జిపై ట్రాఫిక్‌లో దాదాపు 20 నిమిషాలు ఇరుక్కుపోయింది. చివరికి పోలీసులు, స్థానిక యువకులు రంగప్రవేశం చేసి ముందు ఉన్న వాహనాలను క్లియర్ చేయడంతో అంబులెన్స్ ఆస్పత్రికి వెళ్లింది.

కేజీబీవీ బోధకులకు జీవన నైపుణ్య శిక్షణ


మాట్లాడుతున్న డీఈవో రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయంలో బోధన చేస్తున్న సిబ్బందికి సోమవారం జీవన నైపుణ్య శిక్షణ ఇచ్చారు. జిల్లా విద్యాధికారి రమేశ్ మాట్లాడుతూ జీవన నైపుణ్యాల విద్యతో విద్యార్థులలో 10 కీలక జీవన నైపుణ్యాభివృద్ధితోపాటు జీవిత నిర్ణయాలను మరింత సమర్థంగా తీసుకోగలరని అన్నారు. విద్యార్థులలో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, స్వీయ అవగాహన కల్గి ఉంటారన్నారు. క్వాలిటీ కో–ఆర్డినేటర్ వి.శైలజ, జెండర్ అండ్ ఈక్విటీ ఆర్డినేటర్ పద్మజ, పాఠశాల ప్రత్యేకాధికారి పావని పాల్గొన్నారు.

స్టాలిన్ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం


అంబేడ్కర్ చౌరస్తాలో స్టాలిన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నేతలు

సిరిసిల్లటౌన్: హిందువుల సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ అనుచిత వ్యాఖ్యలను సిరిసిల్ల పట్టణ బీజేపీ నాయకులు ఖండించారు. ఈమేరకు సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, అన్నల్‌దాస్ వేణు, గౌడ వాసు, నాగుల శ్రీనివాస్ ఉన్నారు.

కేసీఆర్ భయంతోనే ఇండియా పేరు మార్పు

- కోర్టుకు హాజరుకాని బండి రాజీనామా చేయాలి
- సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్


మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: భారత రాష్ట్ర సమితి ఆవిర్భావంతోనే ప్రధాని మోదీ ఇండియా పేరు భారత్‌గా మార్చేందుకు సిద్ధపడ్డారని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఫైర్‌అయ్యారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంతకాలం డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా అన్న మోదీ భారత రాష్ట్ర సమితితో భయపడ్డారన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పెద్ద బ్లాక్ మెయిలర్ అని మండిపడ్డారు. దురుద్దేశ పూర్వకంగా కేసులు వేసి, విచారణకు డుమ్మాలు కొడుతున్నారని ఆరోపించారు. ఎంపీ ప్రత్యర్థులను బ్లాక్ మెయిల్ చేసేందుకే కోర్టులో కేసులు వేస్తారన్నారు. అమెరికా వెళ్లి ఫుట్‌బాల్ ఆడే తీరిక ఉన్న సంజయ్‌కు కోర్టులో తాను వేసిన కేసుకు తానే హాజరుకానంత బిజీ ఏముందని ప్రశ్నించారు. న్యాయస్థానాల మీద ఏమాత్రం గౌరవంలేని, స్థానిక సమస్యలను పట్టించుకోని సంజయ్ వెంటనే తన పదవికిరాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం వసూళ్ల కోసమే ఆయన అమెరికా పర్యటనకు వెళ్లారని, అక్కడ ఎంత వసూలు చేశారో ప్రజలకు వెల్లడించాలన్నారు. ఎన్నికల్లో సంజయ్‌కు ఓటర్లు తగినబుద్ధి చెబుతారని హెచ్చరించారు.

అరెస్టులు అప్రజాస్వామికం


ఆశవర్కర్లకు సంఘీభావం ప్రకటిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: ఆశవర్కర్ల అరెస్టు అప్రజాస్వామికమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆశవర్కర్లను సోమవారం కలిసి సంఘీభావం ప్రకటించారు. పల్లెల్లో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే ఆశవర్కర్ల డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. చిలుక రమేశ్, కనికరం రాకేశ్, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, సీఐటీయూ నాయకులు గుర్రం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వస్తామని.. వదిలేసి వెళ్లారు

- రెండ్రోజులుగా దిక్కుమొక్కు లేని మహిళ
- సాయం చేసిన యువకులు, కౌన్సిలర్
- జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలింపు


అనారోగ్యంతో ఉన్న మహిళ

కోరుట్ల: ‘ఇక్కడ ఉండు.. ఇప్పుడే వస్తాం’ అని చెప్పి ఓ మహిళను వదిలేసి వెళ్లిన సంఘటన జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఐబీ రోడ్డులో చోటుచేసుకుంది. సదరు మహిళ రెండు రోజులుగా దిక్కుమొక్కు లేక వాటర్ ట్యాంక్ కింద ఉంది. ఆమె దీనస్థితి అందరినీ కలచివేసింది. రెండు రోజుల క్రితం కొందరు ఆటోలో వచ్చి అనారోగ్యంతో ఉన్న మహిళ(45)ను ఐబీ రోడ్డు వాటర్ ట్యాంక్ దగ్గర వదిలేసి వెళ్లారు. అదే ఏరియాలో ఉండే మైనార్టీ యూత్ యువకులు అబూబకర్, షోయబ్ సదరు మహిళను గుర్తించి ప్రశ్నించగా.. తన వాళ్లే వదిలేసి వెళ్లారని చెప్పింది. దీంతో ఆమె అనారోగ్య పరిస్థితిని గుర్తించిన యువకులు.. వెంటనే వార్డు కౌన్సిలర్ పేర్ల సత్యంకు సమాచారం ఇచ్చారు. స్పందించిన వార్డు కౌన్సిలర్ సోమవారం రాత్రి అక్కడికొచ్చి మహిళ వివరాలు తెలుసుకున్నారు. తన పేరు మిర్యాల లక్ష్మి అని, తనది నిజామాబాద్ జిల్లా అని, తన వాళ్లు ఇక్కడ వదిలేసి వెళ్లారని అస్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. కాగా ఆమె చేయిపై విజయ అని పచ్చబొట్టు ఉందని కౌన్సిలర్ సత్యం చెప్పారు. అనారోగ్యంతో ఉన్న మహిళను కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఆ తరువాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహిళ సరైన సమాధానాలు చెప్పకపోగా ఆమె కాలుకు తీవ్రమైన గాయంతో వుందు ఉన్నట్లుగా గుర్తించిన వైద్యులు.. ప్రాథమిక చికిత్స చేయించి జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.